# అగ్ని పురాణము

ఈ అగ్నిపురాణమును గూర్చియు, దీని విశిష్టతను గురించియు ఇదే పురాణములో 271వ అధ్యాయములో ఇట్లు వివరింపబడినది.

శ్లో॥ అగ్నిరూపేణ దేవాదే ర్మఖం విష్ణుః పరాగతిః
ఆగ్నేయస్య పురాణస్య వక్తా శ్రోతా జనార్దనః
తస్మా త్పురాణ మాగ్నేయం సర్వవేదమయం జగత్
సర్వవిద్యామయం పుణ్యం సర్వజ్ఞానమయం పరం
సర్వాత్మహరిరూపం హి పఠతాం శృణ్వతాం నృణాం
విద్యార్థినాం చ విద్యాదం అర్థినాం శ్రీధనప్రదం
సర్వేప్సూనాం సర్వదం తు ముక్తిదం ముక్తికామినాం
పాపఘ్నం పాపకర్తౄణా మాగ్నేయం హి పురాణకమ్.

అనగా శ్రీమహావిష్ణువు అగ్నిరూపముతో దేవదానవ మానవాదులకు ముఖస్థానీయుడై పోషణ చేయుచున్నాడు. అందుచే అగ్నిచే చెప్పబడిన ఈ పురాణమును చెప్పువాడును, వినువాడును గూడ జనార్దనుడే. ఆ హేతువు చేత ఈ పురాణము సమస్తమైన వేదమయ జగత్తుగా గ్రహించవలెను. సర్వవిద్యలు, సర్వవిషయ జ్ఞానము, దీనివలన పొంద వచ్చును. సర్వాత్ముడైన శ్రీహరి విశ్వరూపము దీనిలో చూడవచ్చును. విద్యార్థులకు విద్యలను, కోరినవారికి ధనాది సంపదలను, ముక్తిని గోరువారికి ముక్తిని, అన్నింటిని గోరువారి కన్నింటిని ఇచ్చి సర్వపాపములను బోగొట్టి, మహాపుణ్యము నిచ్చును అని యర్థము. ఈ పురాణమును ఒక విజ్ఞాన సర్వస్వమని చెప్పవచ్చును. లౌకికాలౌకిక విషయము లెన్నో దీనిలో వివరింపబడినవి. ఈ పురాణము ఒక మంత్రశాస్త్రమని కూడ చెప్పుచుందురు. వసిష్ఠ మహామునికి అగ్నిదేవుడు వినిపించిన పురాణమును, నైమిశారణ్యమున సూతుడు శౌనకాది మునలకువినిపించెను.అగ్నిదేవుడు చెప్పిన పురాణము గావున అగ్ని (ఆగ్నేయ) పురాణమని ప్రసిద్ధి కెక్కెను.

## మహా భారత కథ ఔ

"శ్రీకృష్ణుడు భారత యుద్ధములో పాండవుల పక్షమున నిలిచినాడని చెప్పితివిగదా, అగ్నిదేవా!ఆ పాండవు లెవరు?వారి కథను వినిపింపు"మనగా, అగ్నిదేవుడు వశిష్ఠున కిట్లు చెప్పెను."బ్రహ్మ మానసపుత్రుడు అత్రి. అతని కొడుకు చంద్రుడు. అతని వంశమున భరతుడు పుట్టెను. వాని వంశములో శంతను డనువానికి భీష్ముడు పుట్టెను. అతడు పెండ్లి చెసికొనలేదు.

శంతనునికి సత్యవతియందు చిత్రాంగదుడు, విచిత్రవీర్యుడు అనువారు గూడ పుట్టిరి. చిత్రాంగదుడు ఒక గంధర్వునితో పోరాడి మరణించెను. భీష్ముడు విచిత్ర వీర్యునికి కాశిరాజు కూతుండ్రు అంబిక అంబాలిక అనువారిని దెచ్చి పెండ్లిచేసెను. విచిత్రవీర్యుడు క్షయరోగముతో మరణించగా, సత్యవతి ఆదేశముమీద అంబిక వ్యాసుని వలన ధృతరాష్ట్రుని, అంబాలిక పాండురాజును గనెను. ధృతరాష్ట్రునికి గాంధారియందు దుర్యోధనాదులు వందమంది కొడుకులు పుట్టిరి. పాండురాజునకు కుంతి, మాద్రి అని ఇద్దరు భార్యలు. అతడు శాపగ్రస్తుడు కాగా, అతని అనుమతితో కుంతి యమధర్మరాజు ప్రసాదమున ధర్మరాజును, వాయుప్రసాదమున భీముని, ఇంద్రప్రసాదమున అర్జునుని గనెను. మాద్రి అశ్వినుల అనుగ్రహమున నకుల సహదేవులను గనెను. పాండురాజు మాద్రిని కలియబోయి మరణించెను.కర్ణుడు, కుంతికి పెండ్లికాక ముందే సూర్యునివలన పుట్టినవాడు. అతడు దుర్యోధనుడు నాశ్రయించెను. కురుపాండవులు కృపద్రోణుల వద్ద సర్వశస్త్రాస్త్ర విద్యలు నేర్చుకొనిరి. దైవయోగము వలన కురుపాండవుల మధ్య వైరము గలిగెను. దుర్యోధనుడు లక్కయింటిలో బెట్టి పాండవులను దహించెను. పాండవులు తప్పించుకొని ఏకచక్రపురము చేరిరి. మునివేషములతో నుండి బకాసురుని జంపి, పాంచాలదేశమునకు బోయిరి. అక్కడ అర్జునుడు, మత్స్యయంత్రమును గొట్టెను. ద్రౌపది పాండవు లయిదుగురికిని భార్య యయ్యెను. పాండవులకు ధృతరాష్ట్రు డర్ధరాజ్యము నిచ్చెను. శ్రీకృష్ణు డర్జునునిచే ఖాండవ వనము దహింపజేసెను. అప్పుడే అగ్నివలన అర్జునునకు గాండీవ మను విల్లును, రథమునులభించెను.ధర్మరాజు సోదరుల సహాయముతో నలుదిక్కుల రాజులను గెలిచి రాజసూయము మహావైభవముగా జేసెను. అది చూచిన దుర్యోధనునకు కన్నుకుట్టెను. అతడు శకుని, కర్ణ, దుశ్శాసనుల ప్రోత్సాహముతో ధర్మరాజును బిలిచి, శకునితో మాయజూద మాడించి రాజ్యమును నపహరించి పాండవులను పండ్రెండేండ్లు వనవాసమును, ఒక యేడు అజ్ఞాతవాసమును చేయుటకు అడవులకుబంపెను. ధర్మరాజుసోదరులతోను,ద్రౌపదితోను ద్వాదశవర్షములు అరణ్యవాసము చేసి, పదమూడవ యేట అజ్ఞాతవాసము చేయుటకు విరాటనగరమునకు వెళ్ళెను. ధర్మరాజు తాను కంకుభట్టయ్యెను. భీముడు వంటలవాడయ్యెను. అర్జునుడు బృహన్నల యయ్యెను. నకుల సహదేవులు అశ్వగోపాలకులైరి. ద్రౌపది సైరంధ్రిగా విరటుని భార్య సుధేష్ణ దగ్గర చేరెను.అక్కడ కీచకు డను వాడు ద్రౌపదిని కామించి వేధించుచుండగాభీముడొకనాటిరాత్రివానినిగుట్టురట్టుకాకుండమట్టుబెట్టెను.